కళాకారులను, నాటకసంస్థలను ప్రోత్సహించాలి



ఆల్లూరి వెంకటయ్య స్మారక పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ జి రత్నశ్రీ

కడప ఎడ్యుకేషన్: కళాకారులకు, నాటక సంస్థలకు ప్రతి ఒక్కరూ వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహించినప్పుడే మన సాంస్కృతిక కళావైభవాన్ని సజీవంగా నిలుపుకోగలమని ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్, కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడి అన్నారు. కడపలోని నేక్ నామ్ ఖాన్ కళాక్షేత్రంలో సోమవారం భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్), సవేరా ఆర్ట్స్, పోతుల చిన్న ఓబులరెడ్డి కంచమ్మ సరస్వతమ్మ మెమోరియల్ ట్రస్ట్ , చాంద్ బీ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రసిద్ధ నాటక సంస్థ సవేరా ఆర్ట్స్ వ్యవస్థాపకులు ఆల్లూరి వెంకటయ్య స్మారక పురస్కార ప్రదానోత్సవం జరిగింది. నాటక రంగం నుంచి ప్రముఖ సినీ, రంగస్థల నటి డాక్టర్ జి. రత్నశ్రీ, లలిత కళలు విభాగం నుంచి వైవీయూ లలిత కళల విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావులు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కె.చిన్నపరెడ్డి, లయన్ పి ఖాసింఖాన్ మాట్లాడుతూ తెలుగు నాటక రంగ చరిత్రలో సవేరా ఆర్ట్స్ ది ప్రత్యేక అధ్యాయం అన్నారు. ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్ది వారిలోని ప్రతిభకు మెరుగులు అద్దిన ఘనత సవేరా ఆర్ట్స్ వెంకటయ్యకు దక్కుతుందన్నారు. అల్లూరి వెంకటయ్య చిరస్మరణీయుడని కొనియాడారు. పురస్కార గ్రహీతలు డాక్టర్ జి రత్నశ్రీ, డాక్టర్ కోటమృత్యుంజయరావులు మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఆలూరి వెంకటయ్య స్మారక పురస్కారం అందుకోవడం తమ అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో వైవీయూ తెలుగు విభాగం అధిపతి డాక్టర్ ఎస్.ఈశ్వర్ రెడ్డి, పోతుల వెంకటరామిరెడ్డి, ఒంటిమిట్ట ఎంఈఓ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, ధార్మిక వేత్త దేసు వెంకటరెడ్డి, టీడీపీ నగర అధ్యక్షుడు పి.మన్సూర్ అలీ ఖాన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథ్ రెడ్డి , కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. సలీం బాషా, ఆంధ్రప్రదేశ్ ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కారపురెడ్డి చంద్ర ఓబుళరెడ్డి, ఇంటాక్ కో కన్వీనర్ పి. వి. సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ జి. రత్న శ్రీ చే చింతామణి, అలాగే సవేరా ఆర్ట్స్ ఆధ్వర్యంలో శ్రీరామపాదుకలు నాటక ప్రదర్శన అలరించాయి.

క్లుప్తంగా

ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

కడప రూరల్: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేయాలని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి సారకాయల శివశంకర్ తెలిపారు. ఆ మేరకు సోమవారం నూతన కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కు వినతిపత్రం సమర్పించారు. ప్రతి నెల ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీలకు ప్రజా వేదిక ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఎస్టీ బోగస్ సర్టిఫికెట్స్ పైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టి బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. ప్రత్యేకంగా గిరిజన సమస్యలపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మాసీమ బాబుకు అభినందన



మాసీమ బాబును సత్కరిస్తున్న అంజద్‌బాష, ఇతర నేతలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన మాసీమ బాబును మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్ బాష అభినందించారు. సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య యాదవ్, దాసరి శివప్రసాద్ తదితరులు ఆయనను కలిసి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంజద్‌బాష మాట్లాడుతూ టీటీడీ బోర్డు మాజీ సభ్యులు, సీనియర్ నాయకుడైన మాసీమ బాబును స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించడం అభినందనీయమన్నారు. ఆయన మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, బాలస్వామి రెడ్డి, పార్టీ నాయకులు రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు



అండర్-17లో కబడ్డీ జట్టుకు బాల బాలికల జట్టు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14,17 బాల బాలికల క్రీడా ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. సోమవారం నగరంలోని డీఎస్ఎ క్రీడా మైదానంలో నిర్వహించిన బాడ్మింటన్, చెస్, కబడ్డీ, యోగాలలో పోటీలను నిర్వహించి ఎంపికలు చేపట్టారు. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు శ్రీకాంత్ రెడ్డి, చంద్రావతి, మండల కోఆర్డినేటర్ మహబూబ్ బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్ లు పాల్గొని మండల స్థాయి జట్లను ఎంపిక చేశారు.

కాంగ్రెస్ పార్టీతోనే సమ న్యాయం

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశంలో కాంగ్రెస్ పార్టీతోనే అన్ని మతాలకు సమన్యాయం సాధ్య మని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయ జ్యోతి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఓట్ చోర్ -గద్దెచోడ్ కార్యక్రమం సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు జరిగే సంతకాల సేకరణ కార్యక్రమం జయప్రదంగా జరుగుతున్నదని ప్రజల నుంచి మంచి స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. అందులో భాగంగా ఈనెల 10వ తేదీ న ఏఐసీసీ సెక్రెటరీ గణేష్ కుమార్ యాదవ్ సౌత్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వల్లి కడప కు విచ్చేసి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్‌ను విధులకు రావద్దని చెప్పడం సరైనది కాదని, వారిని విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. సోమవా రం ఈ మేరకు గ్రీవెన్‌సెల్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్‌కు సిఐటియు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2019 నుంచి 2025 వరకు గురుకుల పాఠశాలలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. అయితే ఇప్పుడు తొలగిస్తామని చెప్పడం , మౌఖికంగా రావద్దని చెప్పడం సరైనది కాదన్నారు. గత 7 సంవత్సరాలుగా పనిచేసిన సెక్యూరిటీ సూపర్‌వైజర్‌ను తీసేయడం అంటే వారి కుటుంబాలను రోడ్డుపాలు చేయడం తప్ప ఇంకోటి కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య , ఆప్కాస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్ ,రవి తదితరులు పాల్గొన్నారు.

బహుమతి ప్రదానం



విద్యార్థికి బహుమతిని ప్రదానం చేస్తున్న విద్యా సంస్థల వైస్ చైర్మెన్ సుధీర్, కార్పోరేటర్ శ్రీదేవి

కడప ఎడ్యుకేషన్: కడప అక్కాయపల్లెలోని సాయి బాబా విద్యాసంస్థలో సోమవారం స్పెల్బోరేట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పోరేటర్ శ్రీదేవి హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యనే కాకుండా అన్ని విభాగాలలో కూడా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులలో భాషా నైపుణ్యాలు, స్పెల్లింగ్ ప్రతిభను అభివృద్ధి చేయడం ఈ వేడుక ముఖ్య ఉద్దేశ్యమన్నారు. విద్యాసంస్థల వైస్ చైర్మెన్ సాయి సుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ సత్ప్రవర్తన కలిగి ఉండి బాగా చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిభ చూపినవారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ అనితా ఫ్లోరెన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న ఆదర్శనీయుడు

కడప రూరల్: వడ్డెరల సామాజిక వర్గానికి మహనీయుడు వడ్డే ఓబన్న ఆదర్శనీయుడని వక్తలు తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ వేముల రాణి అధ్యక్షతన సమావేశంం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా ఎంతో వెనుకబడిన వడ్డెరలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. వీరుడు వడ్డే ఓబన్న త్యాగాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని పేర్కొన్నారు. వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఓర్సు బాలకొండయ్య మాట్లాడుతూ కొంతమంది స్వార్థపరులతో జిల్లా వడ్డెర సంఘం ఏర్పాటు చేయడం తగదన్నారు. జిల్లా కమిటీ తో పాటు అధ్యక్షుని ఎన్నిక ప్రజాస్వామ్య బద్ధంగా జరగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గంప వీరయ్య, వెంకటసుబ్బయ్య,డేరంగుల సుబ్బరాయుడు, కుంచపు రామచంద్ర, నంద్యాల సుధాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు బయలు దేరిన ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టనున్న రాష్ట్రస్థాయి ధర్నా కార్యక్రమానికి జిల్లా నుంచి సోమవారం రాత్రి అధిక సంఖ్యంలో ఉపాధ్యాయులు బయలు దేరి వెళ్లారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికల తర్వాత మరొకలా వ్యవహరిస్తోందని ఫ్యాప్టో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేడు చేపట్టనున్న రాష్ట్రస్థాయి ధర్నాకు ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ యస్ యం డి ఇలియాస్ బాష, సెక్రటరీ జనరల్ రాళ్ళపల్లి అబ్దుల్లా ఆధ్వర్యంలో భారీగా ఉపాధ్యాయులు తరలివెళ్లారు.

పదోన్నతి

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పీఓడీటీటీ విభాగంలో హెచ్‌ఈఓగా పనిచేస్తున్న దేవిరెడ్డి భారతికి మాస్ మీడియా అధికారిగా పదోన్నతి లభించింది. ఆమె సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా భారతికి ఆ శాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.

15న కడపలో ఎమ్మార్పీఎస్ సమావేశం

బి.కోడూరు : ఈ నెల 15న కడపలో జరిగే ఎమ్మార్పీఎస్ జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గుండాల ఈశ్వరయ్యమాదిగ తెలిపారు. సోమవారం మండలంలోని బి.కోడూరులో ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వరయ్య మాట్లాడారు.

ఎయిడెడ్ పోస్టుల నియామకాలపై విచారణ జరపాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఆర్‌సీఎం ఎయిడెడ్ స్కూళ్లలో జరిగిన చట్టవిరుద్ధ నియామకాలపై మేనేజ్‌మెంట్, సెలెక్షన్ కమిటీ సభ్యులపై విచారణ చేపట్టాలని జేఏసీ నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సుప్రీం కోర్టు నిబంధనలు, అర్హత ప్రమాణాలను ఉల్లంఘించి అక్రమంగా ఉపాధ్యాయ నియామకాలు జరిపారని ఆరోపించారు. టెట్ అర్హత లేని వ్యక్తుల దరఖాస్తులు కూడా స్వీకరించారన్నారు. కొందరు ఒక సబ్జెక్టులో టెట్ అర్హత సాధిస్తే వారిని వేరే సబ్జెక్టులో నియమించారని పేర్కొన్నారు. భారీ మొత్తంలో లంచాలు స్వీకరించి నియామకాల్లో గోల్‌మాల్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, దయాసిస్ ఫాదర్ సంబటూరు సురేష్, ఫాదర్ తలారి బాలరాజులతో ఈ అంశంతో నేరుగా ప్రమేయం ఉందన్నారు. ఈ నియామక నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో జ్యుడిషియల్ విచారణకు ఆదేశించాలని కోరారు. ఇందులో ప్రమేయం ఉన్న సెలెక్షన్ కమిటీ సభ్యులు, దయాసిస్ ప్రొటెటర్‌పై విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఆర్ఎస్ రాజ, సభ్యులు డీఎం ఓబులేశు యాదవ్, అప్పా భాస్కర్, సుబ్బరాయుడు, బాబు, జగన్నానాయక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా

కడప ఎడ్యుకేషన్: కడప ఆర్‌సీఎం ఎయిడెడ్ విద్యా సంస్థలకు సంబంధించిన ఉపాధ్యాయ పోస్టుల రిక్రూట్‌మెంట్ కోసం నిర్వహించిన నోటిఫికేషన్ రద్దు చేయాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కడప పాఠశాల విద్య ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, టీఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజ్, ఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బందెల ఓబులేసులు మాట్లాడుతూ ఆర్‌సీఎం ఎయిడెడ్ విద్యా సంస్థల నోటిఫికేషన్‌లో ఎలాంటి రోస్టర్ విధానాన్ని పాటించకుండా నియామక ప్రక్రియ జరిగిందని ఆరోపించారు. ఈ పోస్టుల భర్తీలో లక్షల రూపాయలు చేతులు మారాయన్నారు. దీనిపై గత రెండు నెలలుగా ఆందోళనలు జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆర్‌జేడీ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బయన్న, ప్రవీణ్, నవీన్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ నాగతులసి ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేసి తమ పాత్ర పోషించాలని ఈగల్ సెల్ అధికారులు సూచించారు. సోమవారం కడప తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో కడప జిల్లా పోలీసు కళా జాతా, శక్తి టీమ్, నార్కోటిక్ టీమ్, ఈగల్ సెల్ సంయుక్తంగా విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈగల్‌ పేరుతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. డ్రగ్స్ వాడకం, అమ్మకాలు చట్ట ప్రకారం నేరమన్నారు. మీ ఇల్లు లేదా కళాశాల చుట్టుపక్కల డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింక్‌లు క్లిక్ చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుదర్శన్ రెడ్డి, తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగతులసి ప్రసాద్ , ఫ్యాక్షన్ జోన్ ఎస్సై, కళా జాతా ఇంచార్జ్ సుబ్రహ్మణ్యం, శక్తి టీం, డీడీఎస్ సిబ్బంది, నార్కోటిక్ సెల్ నుంచి మల్లయ్య, ఈగల్ బృందం సభ్యులు అయూబ్ ఖాన్, గురు శేఖర్ పాల్గొన్నారు.

కార్యకర్తల భద్రత, ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : పార్టీ కార్యకర్తల భద్రత, ప్రజా సంక్షేమమే పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ కడప నార్త్ జోన్ మండల అధ్యక్షులు బీహెచ్ ఇలియాస్ తెలిపారు. సోమవారం కడప నగరంలోని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష కార్యాలయంలో డిజిటల్ బుక్ పోస్టర్‌ను నార్త్ జోన్ డివిజన్ కార్పొరేటర్లు, ఇన్‌ఛార్జిలు, కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఇలియాస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మన ప్రభుత్వం వచ్చిన వెంటనే సత్వరమే పరిష్కారం లభించేలా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ రూపొందించారని అన్నారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ అమలు పరచలేక ప్రజల దృష్టి పక్కదారి మళ్లించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తుందన్నారు. నిరుద్యోగ భృతి ఇంతవరకు ఇవ్వలేదని, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని 20 వేల ఉద్యోగాలు కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు... మన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రవేశపెట్టిన పథకాలను కాపీ కొట్టి పేర్లు మార్చారన్నారు. కార్యకర్తలకు డిజిటల్ బుక్ పై అవగాహన కల్పిస్తామన్నారు. రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి బసవరాజు, రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి అలీ అక్బర్, రాష్ట్ర మైనారిటీ సెల్‌అధికార ప్రతినిధి షేక్ గౌస్ బాషా(చాక్లెట్), కడప పట్టణ మైనారిటీ అధ్యక్షులు షఫీలు మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ సోదరుడు చిరంజీవిని ఉద్దేశించి దేవాలయం లాంటి అసెంబ్లీలో బాలకృష్ణ అభ్యంతరకరంగా మాట్లాడినా ఖండించకపోవడం దారుణమన్నారు. డిజిటల్ బుక్ కేవలం పార్టీ నాయకులు కార్యకర్తలే కాకుండా సామాన్య ప్రజలు కూడా ఉపయోగపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో మీకు ఏదైనా అన్యాయం జరిగి ఉంటే మీరు కూడా మీ డిటైల్స్ డిజిటల్ బుక్ నమోదు చేసుకో వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షంషీర్, అజ్మతుల్లా, ఆరిఫుల్లా, జీలాన్,నార్త్ జోన్ కమిటీ ప్రధాన కార్యదర్శి అల్తాఫ్, ఉపాధ్యక్షులు మహమ్మద్ గౌస్ (బాబు భాయి) సభ్యులు మహమ్మద్ అలీ, గౌస్, ఇమ్రాన్,సమీర్, ఖాదర్, రెహమాన్, షేక్ గయాజ్, ఫారూఖ్ పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పగించాలి



విలేకరులతో మాట్లాడుతున్న రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ హయాంలో ప్రభుత్వమే పారదర్శకంగా మద్యం వ్యాపారం చేసినా, అందులో ఎవరి ప్రమేయం లేకపోయినా ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ తో పాటు గల్లీ లీడర్లు సైతం వైఎస్ జగన్ పై విషం చిమ్మి రాజకీయం చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. కడప నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ కూటమి సర్కార్ అగ్ర నేతల కనుసన్నల్లోనే తెలుగుదేశం పార్టీ నేతలు ములకలచెరువులో నకిలీ మద్యం ప్లాంట్ ఏర్పాటు చేసి వందల కోట్ల రూపాయల నకిలీ మద్యం వ్యాపారం చేశారని, దీని వెనుక ఉన్న బిగ్ బాస్ ఎవరో గుర్తించాలని అన్నారు. ములకల చెరువులో నకిలీ మద్యం ప్లాంట్ ఉన్నట్లు బయటపడిందని, ఇదే కాక రాష్ట్రంలో మరిన్ని ప్లాంట్లు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందని వాటి వెనుక ఉన్న బడా నేతలను బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. హైవేకు ప్రక్కనే, జన సంచారం ఉన్న ప్రాంతంలోనే నకిలీ మద్యం ప్లాంటు ఏర్పాటు చేశారంటేనే దీని వెనుక కీలక వ్యక్తులు ఉన్నట్లు స్పష్టమైనందున నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మేధావుల ఫోరం మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు మూలే భరత్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మైదుకూరు మండల అధ్యక్షుడు కేపీ లింగన్నలు పాల్గొన్నారు.

కార్మికులను తొలగిస్తే ఉద్యమిస్తాం



రిమ్స్‌లో కార్మికులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి

కడప అర్బన్: రిమ్స్‌లో నూతనంగా శానిటేషన్, సెక్యూరిటీ ఏజెన్సీ బాధ్యతలను చేపట్టనున్న ఓ ప్రైవేట్ సంస్థ ఇందులో పనిచేస్తున్న కార్మికులను తొలగించాలని చూస్తోందని, 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించటం కార్మిక చట్ట వ్యతిరేకమని, దానిని ఏమాత్రం ఆర్‌సీపీ సహించబోదని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం రిమ్స్‌లో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్ట ప్రకారం వేతనాలు అందడం లేదని, అందులోను కూడా ఈఎస్ఐ, పిఎఫ్ లలో గోల్మాల్ జరుగుతున్నాయని, నెలనెలా వేతనాలు అందించడంలో తీవ్ర జాప్యం నెలకొంటుందని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. కార్మికులకు ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు వచ్చిన రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ వారికి అండగా ఉంటుందని తెలిపారు.

హామీలను విస్మరించిన పాలకులపై పోరుబాట

బద్వేలు అర్బన్ : ఎన్నికల వేళ ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరుబాట తప్పదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లధనాన్ని వెలికితీసి ప్రజలందరి ఖాతాలో రూ.15 లక్షలు చొప్పున జమ చేస్తామని, ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ వర్గాలకు కట్టబెడుతోందని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. ప్రభుత్వాలు చేస్తున్న ద్రోహాలను ఈ నెల 16న కడపలో జరగనున్న రాయలసీమ జిల్లాల సదస్సులో చర్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరుకు సిద్ధమవుతామని తెలిపారు. సమావేశంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించి వారికి ఉద్యోగభద్రత కల్పించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఏఐటియూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ కడప జిల్లా సమితి ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం జరిగే ఆశాడే సందర్భంగా జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని డాక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో ఆశాలకు మెరుగైన వేతనాలు ఇస్తామని, ఉద్యోగ భద్రత కలిపిస్తామని, సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు అనసూయ, జిల్లా కోశాధికారి సి అమ్ములు పాల్గొన్నారు.

విష జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో విష జ్వరాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు సురేష్ కుమార్, షంషీర్‌లు కోరారు. సోమవారం కమిషనర్ మనోజ్ రెడ్డి కి వారు వినతి పత్రం సమర్పించారు. దోమలు ఎక్కువ అవడంతో నగర ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. నగరంలోని వీధులలో నీటి నిలువలు లేకుండా చేయాలని, కాలువలో పూడిక తీత పనులు చేపట్టాలని, దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పవర్ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం మీద అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ డీపీఎం ప్రవీణ్‌కుమార్

కడప అగ్రికల్చర్: సమాచార హక్కుచట్టం మీద ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కడపలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ విభాగం, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 2005 మీద ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రకృతి సేద్యం సిబ్బంది ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో గ్రామస్థాయిలో రైతులు అందరికీ ప్రకృతి వ్యవసాయంపైన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి పారుదల యాజమాన్య కార్యాలయం అడిషనల్ డీపీఎం, జీవ వనరుల ఉత్పత్తి కేంద్ర యజమానులు పాల్గొన్నారు.

స్వచ్ఛ అవార్డుల కోసమే వర్షపు నీరు తొలగింపు



కలెక్టరేట్‌లో పలు ప్రాంతాలు వర్షం కురిసినపుడల్లా నిలబడిన నీటివల్ల ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం తెల్లవారుజాము కడప నగరంలో కురిసిన వర్షానికి కలెక్టరేట్‌లో పలుచోట్ల వర్షపు నీరు నిలిచింది. కడప నగరంలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వర్షపునీరు నిలిచినా పట్టించుకోని అధికారులు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా సభా భవన్ ఎదుట నిలిచిన కొద్దిపాటి వర్షపు నీటిని ఆగమేఘాలపై ట్యాంకర్ పిలిపించి తొలగించారు. ఈ శ్రద్ధ నగరంలోని ఇతర ప్రాంతాలలో కూడా చూపి పెద్ద ఎత్తున నిలబడిన వర్షపు నీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– ఫోటో : సాక్షి ఫొటోగ్రాఫర్, కడప